క్లుప్తంగా

డబుల్ ట్రాక్ పనులు పూర్తి


డబుల్ ట్రాక్ పనులు జరుగుతున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని డబుల్‌ట్రాక్ పనులు బుధవారం సాయంత్రం పూర్తయ్యాయి. ఉదయం 7గంటలకు రైల్వే గేటు మూసివేసి పనులు ప్రారంభించారు. రాకపోలకు అంతరాయం లేకుండా వాహనాలను మళ్లించారు. బనగానపల్లెకు వెళ్లే వాహనాలను కొలురు మీదుగా మళ్లించారు. సాయంత్రం ట్రాక్ పనులు పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు అనుమతించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


ఓడీఎఫ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని పర్ల, కె.మార్కాపురం, ఉలిందకొండ, ఎ.గోకులపాడు, పెద్దటేకూరు గ్రామాల్లో జరుగుతున్న ఓడీఎఫ్ సర్వే, పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


ఎల్.తాండలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.తాండలో బుధవారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 450లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బట్టి నిర్వాహకుడు వడిత్య సుబ్బిబాయి మీద కేసు నమోదు చేశారు. అదేవిధంగా వేర్వేరు కేసుల్లో రవీంద్రనాయక్, హీర్యానాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. దాడుల్లో సెబ్ సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

సి.బెళగల్: మండలంలో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురిసింది. మండలంలో సరైన వార్షలు కురవకపోవడంతో పత్తి పంటలు వాడుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మండలంలో విస్తారంగా వర్షాలు కువరడతంతో 23 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు అయ్యింది. అదేవిధంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 20 మిల్లీమీటర్ల వర్షాపాతంతో కురిసిన వర్షంతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ నక్కలమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట చేనేత సంఘాల ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేతలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత వస్త్రాల ముడి సరుకులు, ఇతర అవసరాల కోసం ఏటా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత దుస్తుల తయారీ, విక్రయాలకు ప్రభుత్వం సహరించాలని కోరారు. నాయకులు చింతా శ్రీనివాసులు, శకుంతల, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి విలువిద్య శిక్షణ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు సీ.బీ.ఎస్.ఈ స్కూల్ విద్యార్థులకు విలువిద్య క్రీడాంశంలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కే.రాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో విలువిద్యకు సంబంధించిన మెలకువలు నేర్పిస్తారని చెప్పారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు సీ.బీ.ఎస్.ఈ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధ్వానం.. ఆర్టీసీ బస్టాండ్‌లు

- కనీస వసతులు కరువైన పాణ్యం బస్టాండ్
- తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించని అధికారులు
- అత్యవసరాలకు ఇబ్బందులు పడుతున్న మహిళలు


పాణ్యం బస్టాండ్

పాణ్యం: ఆర్టీసీ బస్టాండ్‌లు నానాటికి అధ్వానంగా ఉన్నాయి. ప్రయాణికులకు కనీస సౌకర్యాల కల్పించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాండ్‌లో వేచి ఉన్న సమయంలో ప్రయాణికులకు తాగునీరు, మరుదొడ్లు, కూర్చునేందుకు వసతులు కరువయ్యాయి. ఈ సౌకర్యాలు కేవలం డిపోలు ఉన్న బస్టాండ్‌లో మాత్రమే ఉన్నాయి. మిగితా బస్టాండ్‌లో ఎక్కడ ఈ సౌకర్యాలు కనిపించడం లేదు. మండల కేంద్రం పాణ్యం బస్టాండ్ మరీ అధ్వానంగా మారింది. కనీస వసతులు కల్పించాలని ప్రజా సంఘాలు, ప్రజలు, ప్రయాణికులు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల పాణ్యం వచ్చిన నంద్యాల డిపో మేనేజర్‌కు ప్రజలు సమస్యలు విన్నవించినా స్పందన లేదు. సౌకర్యాలు కల్పించాలంటే దాతలు ముందుకు రావాలంటూ అన్న ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించని ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలాలకు వచ్చిన అద్దె ఆదాయం ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు స్థానికులు.

నిత్యం రద్దీ

జాతీయ రహదారిపై ఉన్న పాణ్యం ఆర్టీసీ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో కర్నూలు, బనగానపల్లె, తాడిపత్రి, అనంతపురం, కడప, హైదరాబాద్ తదితర పట్టణాలకు నిత్యం ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగుతుంటాయి. ఆర్టీనరీ నుంచి ఇంద్ర, గరుడ బస్సుల రాకపోకలు సాగుతుంటాయి. ప్రత్యేకించి నంద్యాల - కర్నూలు బస్సులు ఎక్కువ ఉంటాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువే. అయితే బస్టాండ్‌లో మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రత్యేకించి మహిళల ఇబ్బందులు వర్ణానాతీతం. అత్యవసరాలకు పడరానిపాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు....

పాణ్యం మండలం పరిధిలోని జాతీయ రహదారి వెంట హైవే అధికారులు బస్‌షెల్టర్లు నిర్మించారు. పాణ్యం మినహాయించి ఏ గ్రామంలో ఉపయోగపడడం లేదు. తమ్మరాజుపల్లె వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. అలాగే నూలుమిల్లు, ఆర్జీం కళాశాల వద్ద నిర్మించి బస్ సెల్లర్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి.

ప్రతిపాదనలు పంపాం

పాణ్యం బాస్టండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపాం. మహిళలుకు ఇబ్బంది లేకుండా మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తాం. అనుమతులు రాగానే పనులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది రాకుండా చూస్తాం. పాణ్యం బస్టాండ్ సౌకర్యాలపై అధికంగా ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవం. త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తాం.

– గంగాధర్, డీఎం, నంద్యాల డిపో

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి బుధవారం తెలిపారు. తెలుగు, కామర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు ఈనెల 12న నిర్వహించే డోమోకు ఒరినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9866041775 సంప్రదించాలన్నారు.

కష్టపడి చదువుకోవాలి

కల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని కేవీ సుబ్బారెడ్డి కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ ఎస్ విజయ లక్ష్మమ్మ తెలిపారు. బుధవారం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డిలేట్ కంపెనీ హెచ్‌ఆర్ లహరి, ప్రిన్సిపాల్ కన్నా కుమార్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..వ్యక్తి మృతి


మృతుడు గోపినాయక్ (ఫైల్)

ఓర్వకల్లు: వ్యవసాయ పనుల నిమిత్తం వినియోగిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు మండలంలోని గుమ్మితం తండాకు చెందిన గోపి నాయక్(30) వరినాట్ల నిమిత్తం ట్రాక్టర్‌తో దుక్కి దున్నితుంగా ప్రమాదశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ నడుతపుతున్న డ్రైవర్ గోపినాయక్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు, నలుగురు పిల్లలు సంతానం. ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రాజారెడ్డి తెలపారు.


ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో మృతి చెందిన గోపినాయక్

నీటి మళ్లింపును ప్రారంభించిన ఎమ్మెల్యే

సి.బెళగల్: సంగాల గ్రామం దగ్గర తుంగభద్ర నది నుంచి కంబదహాల్ ఎత్తిపోతల పథకానికి నీటి తరలింపును బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ముందుగా తుంగభద్ర నదిజలాలకు ఆయన పూజలు చేశారు. అయితే సమాచారం లోపంతో ఇరిగేషన్ అధికారులు ఆలస్యంగా వచ్చారు. వారి కోసం ఎమ్మెల్యే ఎదురుచూడాల్సి వచ్చింది.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా పాఠశాలను గురువారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పాఠశాల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలని ఎస్ఓ జ్యోతిని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శక్తిసదన్ పరిశీలన

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని మహిళా ప్రాంగణం (శక్తిసదన్)ను సందర్శించారు. ఆ కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతను పరిశీలించి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అక్కడి వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ – 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు.

విద్యార్థి మృతిపై ఆర్డీఓ విచారణ


విద్యార్థి మృతిపై అమడగుంట్ల బీసీ హాస్టల్లో విచారిస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

కోడుమూరు రూరల్: హాస్టల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి బుధవారం విచారణ జరిపారు. మండలంలోని అమడగుంట్ల గ్రామానికి వెళ్లి బీసీ హాస్టల్ పరిసరాలను ఆర్డీఓ పరిశీలించి విద్యార్థి మృతిపై వార్డెన్ ప్రసన్నకుమార్‌తో మాట్లాడారు. అలాగే హాస్టల్ విద్యార్థులతోనూ ఆర్డీఓ విడిగా మాట్లాడారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలున్నాయా, భోజనం, వసతి బాగుందా... ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ కోడుమూరు ప్రభుత్వాసుపత్రి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులు రాధమ్మ, కమ్మరి బ్రహ్మయ్యలతోనూ ఆర్డీఓ మాట్లాడారు. పిల్లవాడికి ఇష్టం లేనప్పుడు ఎందుకు హాస్టల్లో బలవంతంగా చేర్పించారని ప్రశ్నించగా తమ కుమారుడు అమడగుంట్ల హాస్టల్లో ఉండి చదువుకుంటానని చెప్పినందునే చేర్పించామన్నారు. ఇష్టం లేదని తమతో చెప్పలేదని కన్నీరు పెట్టుకున్నారు. కూలీ పనులు చేసుకునే జీవనం సాగిస్తున్నామని, హాస్టల్లోనైనా బాగుంటారని ఆలోచించామన్నారు. ఇంతలోనే ఇంత ఘోరం జరిగిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్డీఓ వెంట కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషిరెడ్డి

కల్లూరు: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి సూచించారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ కె.ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వినతులకు సంబంధించి ఇచ్చిన గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా కౌలు కార్డుల ప్రయోజనాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు మంజూరు చేయాలని సూచించారు. రేషన్ బియ్యం పంపిణీ ఎండీయూ వాహనాల ద్వారా వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివరామ్, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం?

- ప్రొటోకాల్ పాటించడం తెలియదా?
- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు


ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న దుర్వేశి సర్పంచ్ మమత

గడివేముల: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదకలను వివరించారు. ఒక్కసారిగా అధికారుల తీరును సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పుపట్టారు. ప్రజాప్రతినిధులు అంటే ఎందుకీ నిర్లక్ష్యం అంటూ నిలదీశారు. ప్రొటోకాల్ ఏ మాత్రం పాటించడం లేదని దుర్వేశి గ్రామం సర్పంచ్ మండ్ల మమత ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇష్టారాజ్యంగా పింఛన్ పంపిణీ చేశారని, కనీసం సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. ఒకే ఆసుపత్రిలో ఇద్దరు పింఛన్ లబ్ధిదారులు చికిత్స పొందుతుండగా ఒకరికే నగదు ఇవ్వడంలో అంతర్యం ఏమిటని నిలదీశారు. పేదల విషయంలో ఇలా వ్యవహరించడం ఉద్యోగులకు తగదని ఆమె హెచ్చరించగా స్పందించిన ఎమ్మెల్యే ప్రొటోకాల్ పాటించాలని అధికారులకు సూచించారు. గడివేముల గ్రామంలో శ్మశాన వాటిక చాలా చిన్నదిగా ఉన్నదని, కొంత స్థలం కేటాయించాలని ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి కోరారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతన్నాయని, దీంతో దొంగతనాలు అధికమయ్యాయని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి సభ దృష్టికి తీసుకురాగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం వ్యస్తంగా మారిందని, రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీలకు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ గురునాథ్, ఎంపీడీఓ శివరాంరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఏఈలు మూర్తి, పవన్, ఏఓ హేమ సుందర్ రెడ్డి, ఏపీఎం హజరత్, ఎంఈఓ-2 విమలా వసుంధరదేవి, సర్పంచ్‌లు శేఖర్, నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రామస్వామి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడాలి


చేనేత జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : సమస్యల పరిష్కారానికి చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి పిలుపునిచ్చారు. బుధవారం కోడుమూరులో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు చేనేత జెండాను ఆవిష్కరించారు. అనంతరం చేనేత కార్మికులను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24వేలు అందజేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.36వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మణి, రిటైర్డ్ తహసీల్దార్ సీబీఅజయ్‌కుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు ఏకాంబరం, దానకర్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, కర్రె శ్రీరాములు, సాయ నాగరాజు, గంగన్న పాల్గొన్నారు.

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో...

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ, మండల కార్యదర్శి రాజు, సీపీఎం డివిజన్ కార్యదర్శి గఫూర్‌మియ్యా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న తదితులు గాంధీ విగ్రహాన్ని పూలమా, చిట్యాల నూలు దండలను వేసి నివాళులర్పించారు.

● కుంట కాదు... రోడ్డే!


ఆలమూరులో ఓ ఇంటి ఎదుట కుంటను తలపిస్తున్న వర్షపునీరు


పాణ్యం: పల్లెల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. చిన్నపాటి వర్షానికి రహదారులు కుంటలను తలపిస్తున్నాయి. ఆలమూరు గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటి మూలంగా రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఓ ఇంటి ఎదుట వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా భారీ వాహనం వెళ్తే మురుగునీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నీటి నిల్వ మూలంగా సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

ఓర్వకల్లు: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల(ఎస్ఎంసీ)కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 48 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతున్నట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. అన్ని పాఠశాలలో ఓటర్ల జాబితాను ప్రదర్శించామన్నారు. మొత్తం 48 పాఠశాలల్లో కలిపి 6,329 మంది విద్యార్థులు చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రిటర్నింగ్ అధికారులుగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు వ్యవహరిస్తారని వెల్లడించారు. చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నికొని అదేరోజు మధ్యాహ్నం తొలి సమావేశం నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు ఎన్నికలల్లో పాల్గొనాలని సూచించారు.

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం పాఠశాల నిర్వహణ కమిటీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ – ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 31 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్, కస్తూర్బా, గురుకులం పాఠశాలల్లో ఉదయం ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఉంటుందని వివరించారు. తదనంతరం చైర్మన్ అధ్యక్షతన మొదటి సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ తెలిపారు.

రోడ్లు గుంతలమయం!


దినెదేవరపాడు రోడ్డు ఇలా...

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లలో గుంతలు విపరీతంగా ఏర్పడడంతో పాదచారులతోపాటు వాహనచోదకులు పడరానిపాట్లు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు గుంతలమయం అవుతున్నాయి. ఏది గుంతో.... ఏది రోడ్డో అర్థమవ్వని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని లక్ష్మీపురం నుంచి దొడ్డిపాడు వెళ్లే రోడ్డు మొత్తం గుంతల మయంగా మారింది. అలాగే కర్నూలు నగరం సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి దిన్నె దేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి అంతే. మహాలక్ష్మి నగర్, విఘ్నేశ్వర్ కాలనీ రహదారులు అధ్వానంగా మారాయి. రాత్రి గుంతలను గుర్తించక వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


ఛిద్రమైన దొడ్డిపాడు రోడ్డు